



నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద గద్వాల మండలం కొండపల్లి వద్ద ఆగిపోయిన అక్విడెక్ట్ నిర్మాణం

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల్లో పనుల పూర్తిపై రైతాంగం ఆశలు
- పాలమూరులో నాలుగు ప్రాజెక్టుల కింద పెండింగ్ పనులు
- పూర్తయితే 2.32 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరు
- పనులు పూర్తి చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్



నీరివ్వకపోవడంతో పూడుకుపోయిన నెట్టెంపాడు ప్రధాన కాల్వ

మహబూబ్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పాలమూరు ఉమ్మడి జిల్లాలోని నాలుగు కీలక ప్రాజెక్టుల కింద పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలనే డిమాండ్ రైతాంగం నుంచి వస్తోంది. సమైక్య రాష్ట్రంలో జలయజ్ఞం కింద చేపట్టిన ఈ పథకాల్లో పెండింగ్ పనులు కొన్ని ఇప్పటికీ అలాగే ఉండటంతో ఈ ప్రాజెక్టుల కింద పూర్తిస్థాయి ఆయకట్టు అమల్లోకి తేలేని పరిస్థితి నెలకొన్నది. ఉమ్మడి జిల్లాలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, రాజీవ్ భీమా రెండు దశల ఎత్తిపోతల పథకాలు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాల కింద పెండింగ్ పనులు అలాగే ఉండటంతో సుమారు 2.32 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందని దుస్థితి నెలకొన్నది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ అభ్యర్థులంతా ఈ పెండింగ్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం, వారే అధికారంలోకి రావడంతో ఈ పనులు పూర్తి చేస్తారనే ఆశ రైతాంగంలో కనిపిస్తోంది. త్వరలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఈ పెండింగ్ పనులు పూర్తిచేసే అంశంపై చర్చించాలనే సూచనలు వస్తున్నాయి.

పనులు ఎక్కడివక్కడే

ఈ నాలుగు ప్రాజెక్టుల కింద కీలకమైన పెండింగ్ పనులతో పాటు, సబ్‌కెనాల్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. తమ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు కావడంతో కింద పెండింగ్ పనులతో పాటు, సబ్ కెనాల్స్ పనులను పూర్తిచేసి సాగునీరందిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాల్లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, అందరు ఎమ్మెల్యే అభ్యర్థులు హామీలివ్వడంతో పనులను చేపడతారనే ఆశలు చిగురిస్తున్నాయి. ప్రధానంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద వెల్దండ మండలంలో డీ-82 కాల్వ పూర్తికి పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉంటే, కల్వకుర్తి, మిడ్జిల్, ఉర్కొండ, మండలాల్లో రోడ్లు దాటే వద్ద, పొలాల వద్ద పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. బ్రిడ్జిలు, పిల్ల కాల్వల పనులు కొలిక్కిరాలేదు. ఇలా ఈ ప్రాజెక్టు కింద పిల్ల కాల్వల పనులు దాదాపు 60 శాతం వరకు పెండింగ్‌లోనే ఉన్నాయని, వీటన్నింటినీ సమీక్షించి పనులు చేపట్టాలని కోరుతున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద 99వ ప్యాకేజీ, 107వ ప్యాకేజీల కింద ప్రధాన కాల్వల పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటికితోడు ఈ పథకం కింద పిల్లకాల్వల పనులదీ అదే పరిస్థితి నెలకొన్నది. కొన్నిచోట్ల నిర్మాణాలు చేపడితే, కొన్నిచోట్ల సగం పనులతో వదిలేశారు. అదేవిధంగా ఈ పథకం కింద చేపట్టాల్సిన చిన్నోనిపల్లి మరో రెండు చిన్న రిజర్వాయర్ల నిర్మాణాల పనులపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.. ఈ పనులన్నింటినీ చేపడితేనే ఈ పథకం ఉద్దేశం నెరవేరుతుందని చెబుతున్నారు. మరోవైపు రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం కింద మొదటిదశలో చేపట్టిన సంగంబండ రిజర్వాయర్, కాల్వల పనులకు సంబంధించి ఎడమ ప్రధాన కాల్వకు అడ్డంకిగా ఉన్న 400 మీటర్ల బండ తొలగింపు పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. ఈ పథకం కింద మాగనూరు, కృష్ణా, మండలాల భూములకు నీరిచ్చే పిల్ల కాల్వల పనులు పూర్తికాలేదు. మరోవైపు మక్తల్, అమరచింత, ఆత్మకూరు మండలాల్లో ప్రాజెక్టు ప్రధాన కాల్వను చెరువులకు అనుసంధానం చేసి వదిలేశారే తప్ప పిల్ల కాల్వల పనులు చేపట్టలేదు. ఇంకోవైపు రాజీవ్ భీమా రెండో దశ కింద శంకర సముద్రం ముంపు గ్రామం కానాయపల్లి భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో అక్కడ పనులు పూర్తికాలేదు. ఈపథకం కింద కూడా సబ్ కెనాల్స్, రిజర్వాయర్ పూర్తి పనులు చేపట్టాల్సి ఉంది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం కింద సైతం చేపట్టిన కుడి, ఎడమ కాల్వల విస్తరణతో పాటు, లైనింగ్ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే తప్ప నిర్దేశిత ఆయకట్టు 50 వేల ఎకరాలకు నీరివ్వడం సాధ్యమవుతుందే తప్ప లేకపోతే ఎక్కడిగొంగడి అక్కడ అన్న పరిస్థితి ఉంటుంది. మొత్తంగా ఈ నాలుగు ప్రాజెక్టుల కింద పెండింగ్ పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తే వచ్చే వానాకాలం నాటికైనా ఇంకో 2.32 లక్షల ఎకరాలకు నీరందుతుందని, నిర్దేశిత లక్ష్యమైన 8.77 లక్షల ఎకరాలకు సాగునీరందుతుందని రైతాంగం కోరుతోంది. త్వరలో ఇరిగేషన్ పనులపై సమీక్ష నిర్వహించాలని భావిస్తోన్న ప్రభుత్వ పెద్దల దృష్టికి జిల్లా ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని తీసుకెళ్లాలని రైతులు కోరుతున్నారు.

6.45 లక్షల ఎకరాల సాగు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 8,77,816 ఎకరాల బీడు భూములకు నీరందించే ఉద్దేశంతో సమైక్య రాష్ట్రంలో జలయజ్ఞం కింద కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు చేపట్టారు. 2014 ఎన్నికలకు ముందు ఈ పనుల్లో లిఫ్టులు, ప్రధాన కాల్వల పనులు దాదాపు 70 శాతం వరకు పూర్తిచేసి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఆయేడాది 2.40 లక్షల ఎకరాల వరకు నీరందించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పనులపై సమీక్ష నిర్వహించి పనులను పూర్తి చేసేందుకు కార్యాచరణ అమలు చేసింది. అందులో భాగంగా ఈ నాలుగు పథకాల కింద ప్రత్యేకించి కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు పథకాల కింద కీలక పనులను పూర్తి చేయకుండానే చెరువులకు ఈ ప్రధాన కాల్వల నీటిని మళ్లించడం ద్వారా మొత్తం ఆయకట్టు పరిధిలో భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా అప్పటికే ఉన్న బోరుబావులలో నీటిమట్టాలు పెరగడం, విద్యుత్ సరఫరా ఇబ్బందిలేకపోవడంతో రైతులకు పంటలు పండించడంలో ఇబ్బందుల్లేకుండా పోయాయి. దీంతో పెండింగ్ పనులు, సబ్ కెనాల్స్ నిర్మాణంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఆవశ్యకత లేకుండా పోయింది. ఈ ఎత్తిపోతల పథకాల కింద కాల్వల ద్వారా, చెరువుల ద్వారా, బోరుబావుల కింద కలిపి మొత్తంగా నాలుగు పథకాల కింద ప్రస్తుతం 6.45 లక్షల ఎకరాలకు సాగునీరిస్తున్నట్లు ఇరిగేషన్, వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.



కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో వెల్దండ మండలం చెరుకూరు వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రధాన కాల్వ పనులు

కేసీఆర్ కిట్ లేనట్లే?

- 15 రోజులుగా సరఫరా నిలిపివేత
- న్యూట్రిషన్ కిట్లూ నిలుపుదల
- వాటి కోసం 1,220 మంది లబ్ధిదారుల ఎదురుచూపు



కేసీఆర్ కిట్‌తో మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో బాలింత(ఫైల్)

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జనవరి 3: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు గత ప్రభుత్వం చేపట్టిన కేసీఆర్ కిట్ పథకం ఇక లేనట్లే అనిపిస్తోంది. 15 రోజుల నుంచి కిట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పాటు బాలింతలకు న్యూట్రిషన్ కిట్‌ల సరఫరా కూడా ఆగిపోయింది. ఇప్పటి వరకు అక్కడక్కడ ఉన్న వాటిని సర్దుబాటు చేస్తూ కాలం గడిపారు. ఇప్పుడు అవి కూడా అయిపోయాయి. దీంతో కేసీఆర్ కిట్ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,220 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పేరును ఎంసీహెచ్ కిట్‌గా ఆన్‌లైన్‌లో మార్పులు చేసింది. కానీ ఆ కిట్లు ఇప్పటి వరకు సరఫరా చేయలేదు.

ఒక్కో ఆస్పత్రి నుంచి వందల మంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కలిపి ఒక్కో జిల్లాలో ప్రతీ నెల 400 నుంచి 600 వరకు ప్రసవాలు అవుతున్నాయి. అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 600, వనపర్తిలో 450, గద్వాల్‌లో 400, నాగర్‌కర్నూల్‌లో 400, నారాయణపేటలో 350 వరకు డెలివరీలు అవుతున్నాయి. అదేవిధంగా రోజూ ఒక్కో ఆస్పత్రి నుంచి 25 నుంచి 30 మంది వరకు డిశ్చార్జి అవుతున్నారు. వీరందరికి కేసీఆర్ కిట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఈ 15 రోజుల్లో 1,220 మంది లబ్ధిదారులు కేసీఆర్ కిట్ కోసం ఎదురుచూస్తున్నారు. అందులో మహబూబ్‌నగర్‌లో 280, నాగర్‌కర్నూల్‌లో 230, వనపర్తిలో 260, గద్వాల్‌లో 240, నారాయణపేటలో 210 మందికి కిట్లు ఇవ్వాల్సి ఉంది.

14 రకాల వస్తువులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రవవాలను వంద శాతం పెంచేందుకు గత ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని 2017 జూన్ 2న అమల్లోకి తెచ్చింది. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేసుకున్న మహిళలకు 14 రకాల వస్తువులతో కూడిన కిట్‌ను అందజేసింది. గత ఐదేళ్లుగా ఈ పథకం విజయవంతంగా కొనసాగింది. తాజాగా గత ప్రభుత్వం పోయి.. కొత్త ప్రభుత్వం రావడంతో ఆ పథకాన్ని నిలిపేశారు. అంతేకాకుండా కిట్‌ల సరఫరా కూడా నిలిచిపోయింది. వేరే ఆస్పత్రుల్లో ఉన్న కిట్‌లను అరువుగా తీసుకొచ్చి సర్దుబాటు చేయగా, ఇప్పుడు ఆ పరిస్థితీ లేకుండా పోయింది.

న్యూట్రిషన్ కిట్ల పరిస్థితీ అంతే

మాతా శిశు మరణాలను తగ్గించడంతో పాటు తల్లి, బిడ్డ సంరక్షణలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం అయిన మహిళలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ కిట్‌లో దాదాపు 10 రకాల తినుబండారాలు, వస్తువులు ఉన్నాయి. ఈ పథకాన్ని గత జూన్ 14న అమల్లోకి తెచ్చారు. ఈ కిట్ల పంపిణీ కూడా వారం రోజులుగా నిలిచిపోయింది. ఉన్న కిట్లు ఈనెల 31 వరకు పంచిపెట్టారు. కానీ.. అవి కూడా అయిపోవడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్పు

గత ప్రభుత్వం పెట్టిన కేసీఆర్ కిట్ పథకం పేరును కొత్త ప్రభుత్వం ఎంసీహెచ్(మదర్ చైల్డ్ హెల్త్) కిట్‌గా పేరు మార్చింది. ఆన్‌లైన్‌లో కూడా ఇదే పేరుతో లబ్ధిదారుల పేర్లను నమోదు చేస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే పేరును మార్చగా, కిట్లను మాత్రం సరఫరా చేయలేదు.

ఆదేశాలు రాలేదు

కేసీఆర్ కిట్ నిలుపుదల, పంపిణీకి సంబంధించి మాకు ఆదేశాలు రాలేదు. ఉన్నంత వరకు కిట్లను లబ్ధిదారులకు ఇచ్చాం. కొత్త ప్రభుత్వం కేసీఆర్ కిట్ పేరును ఎంసీహెచ్ కిట్‌గా మార్చింది. అయితే ఇప్పటి వరకు ఆ పేరుతో ఇంకా కిట్లు రాలేదు. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం.

\- డాక్టర్ కృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి.



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో కేసీఆర్ కిట్ కోసం నిలబడిన మహిళలు(ఫైల్)

తగ్గిపోతున్న.. పని దినాలు

- గుర్తించిన వాటిలో సగం కూడా కల్పించని పనులు
- ఫలితంగా తగ్గిన కూలీలకు వేతనాల చెల్లింపులు
- రిపోర్టులు మాత్రం వంద శాతం సక్సెస్ అయినట్లు నమోదు



కంప చెట్లను తొలగిస్తున్న ఉపాధి కూలీలు(ఫైల్)

గద్వాల, జనవరి 3: పేద ప్రజలకు పని కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొందరు సిబ్బంది నిర్వాకం వల్ల నిర్వీర్యం అవుతోంది. పథకం విజయవంతంగా అమలవుతున్నట్లు రిపోర్టుల్లో పేర్కొంటుండగా, వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని నాలుగేళ్ల రిపోర్టులను పరిశీలిస్తే.. అది స్పష్టమవుతోంది. 2021-22లో లేబర్ బడ్జెట్‌లో 32.04 లక్షల పనిదినాలు కల్పించగా, 2023-24కు వచ్చే సరికి 18.30 లక్షలకు పడిపోయింది. అంటే దాదాపు 14 లక్షల పని దినాలు తగ్గిపోయాయి. 2021-22లో రూ.94.77 కోట్లను ఖర్చు చేయగా, 2023-24కు వచ్చే సరికి రూ.64.34 కోట్లకు పడిపోయింది. అంటే దాదాపు రూ. 30.43 కోట్లు తగ్గింది. ఇలా ఏడాదికేడాది పని దినాలు తగ్గిపోతున్నా.. ఏటా 100 శాతం టార్గెట్‌ను పూర్తి చేసినట్లు రిపోర్టులు ఇవ్వడం గమనార్హం.

ఎందుకీ ఈ పరిస్థితి

జిల్లాలో 1.55 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, అందులో 89 వేల జాబ్ కార్డులే యాక్టివ్‌లో ఉన్నాయి. జాబ్ కార్డుల్లో 3.34 లక్షల మంది పేర్లు నమోదు చేసుకోగా, 1.62 లక్షల మంది మాత్రమే పనికి వస్తున్నారు. గతంలో ఎలాంటి పనులకైనా ఆమోదం పొంది, చేసేవాళ్లు. ఆ పనులను చేయడానికి కూలీలు అధిక సంఖ్యలో వచ్చేవాళ్లు. చేసిన పనికి వారం రోజుల తర్వాత వేతనాలు చెల్లించేవాళ్లు. కానీ ప్రస్తుతం పథకంలో నిర్దేశించిన పనులే చేయాలి. చేసిన పనులకు డబ్బులు సక్రమంగా రావడం లేదు. మధ్యలో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడంతో కూలీలకు, సిబ్బందికి మధ్య లింక్ తెగిపోయి, పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గింది. ఉపాధి సిబ్బంది కూడా పనులు నిర్వహించడంలో శ్రద్ధ వహించడం లేదు. వాళ్ల రిపోర్టులు తయారు చేయడంలో చూపుతున్న శ్రద్ధ పనులు కల్పించడంలో లేకపోవడంతో లేబర్ దినాల సంఖ్య తగ్గింది. ఉపాధిపై సమీక్షలు నిర్వహించి, సూచనలు చేయాల్సిన స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ రిపోర్టుల వరకే పరిమితం అయ్యారు. ఒక్క యాక్షన్.. రియాక్షన్ లేనందున అటు అధికారుల్లో, ఇటు సిబ్బందిలో నిర్లక్ష్యం పేరుకుపోయింది.

కాగితాలకే పరిమితమైన అధికారులు

ఉపాధి హామీ పథకాన్ని పర్యవేక్షించే అధికారులు కాగితాలకే పరిమితం అయ్యారు. వారడిగిన రిపోర్టును సిబ్బంది పెడితే పనిని సక్సెస్ చేసినట్లే భావిస్తున్నారు. 2021-22లో 31.92 లక్షలకు లేబర్ బడ్జెట్‌ను తయారు చేసి 32.04 లక్షల పని దినాలు కల్పించారు. అంటే దాదాపు 101 శాతం పూర్తి చేశారు. అదే 2022-23కు వచ్చే సరికి 26.43 లక్షలకు బడ్జెట్ తయారు చేసి, 27.87 లక్షల పనిదినాలను కల్పించారు. అంటే 105 శాతం సక్సెస్ సాధించారు. కానీ ఇక్కడ 5.61 లక్షల లేబర్ దినాలు తగ్గిపోయాయి. దీనిని అధికారులు పట్టించేకోలేదు. అదేవిధంగా 2023-24లో 18.16 లక్షలకు లేబర్ బడ్జెట్‌ను తయారు చేసి, ఇప్పటి వరకు 18.30 లక్షల పనిదినాలు కల్పించారు. అంటే గత ఏడాది కంటే 9.57 లక్షల పనిదినాలు తగ్గించారు. దీనిని అధికారులు పట్టించుకోవడం లేదు. కానీ వారు సాధించిన 100 శాతం టార్గెట్‌ను చూస్తున్నారు. పని దినాలను తగ్గించి టార్గెట్‌ను పూర్తి చేస్తున్నట్లు చూపుతుండటంతో ఏటా లేబర్ బడ్జెట్ తగ్గిపోతోంది. ఫలితంగా ఖర్చయ్యే నిధులు కూడా తగ్గిపోతున్నాయి. 2021-22లో రూ.94.77 కోట్లను ఖర్చు చేయగా, 2022-23లో రూ.79.60 కోట్లు ఖర్చు చేశారు. అంటే దాదాపు రూ.15.17 కోట్లు తగ్గింది. దీని వల్ల కూలీలు నష్టపోయారు. అదేవిధంగా 2023-24లో రూ.64.34 కోట్లకు పడిపోయింది. ఈ ఏడాది కూడా రూ.15.26 కోట్లు తగ్గిపోయింది. ఈ రెండేళ్లలోనే రూ. 30.43 కోట్లను ఉపాధి కూలీలు కోల్పోయారు. ఇది ఉపాధి నిర్వీర్యానికి దారి తీస్తోంది.

ఈ ఏడాదైనా పని దినాలు పెరిగేనా..

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వ్యవసాయం సరిగా సాగలేదు. దాంతో వ్యవసాయ కూలీ పనులు కరువయ్యాయి. వర్షాలు లేక రబీలో చాలా పంటలకు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఫలితంగా కూలీలకు పని దొరకని పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా వారిని ఆదుకోవాల్సి ఉంది. పథకం కింద పనులు కల్పించి, వేతనాలు సక్రమంగా చెల్లించకపోతే వలసలు పోవడం ఖాయంగా కనిపిస్తోంది. గత ఏడాది లేబర్ బడ్జెట్‌లో 18.16 లక్షల పనిదినాలు ఉన్నాయి. ఈ ఏడాది(2024-25కు) 24.41 లక్షల దినాలకు లేబర్ బడ్జెట్ తయారు చేశారు. అంటే ఆరు లక్షల పనిదినాలు పెంచారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు ముమ్మరంగా పనులు కల్పించాలి. అప్పుడే లేబర్ బడ్జెట్‌కు న్యాయం చేసినవారు అవుతారు.

స్పెషల్ డ్రైవ్‌లో 370 వాహనాలు సీజ్


\- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 3 : నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్ ఏరియాలో బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 370 వాహనాలు సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఈ తనిఖీల్లో నెంబరు ప్లేట్లు లేని వాహనాలు, సగం నెంబరు ఉన్నవి, సరైన నెంబరు ప్లేట్లు లేని 370 వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సరైన నెంబరు ప్లేట్, డాక్యుమెంట్స్ కలిగి ఉంటేనే రోడ్డుపైకి వచ్చి బండి నడపాల్సిందిగా ఆయన సూచించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- తెలకపల్లి: మండల కేంద్రంలో వాహనాల తనిఖీల్లో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో 22 బైకులు పట్టుబడ్డాయని తెలకపల్లి ఎస్ఐ వసురాం నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబరు ప్లేట్ లేని వాహనాలు, లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం వంటివి చేయరాదని పట్టుబడితే స్వాధీనం చేసుకోవడం తప్పదన్నారు.

మెగా డీఎస్సీపై ఆశలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,968 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- మార్చి తర్వాత మరిన్ని పెరిగే అవకాశం
- మొత్తం భర్తీ చేసే యోచనలో ప్రభుత్వం
- విభాగాల వారీగా ఖాళీల వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ



మహబూబ్‌నగర్ విద్యా విభాగం, జనవరి 3: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం త్వరలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. నిలిచిన ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని, మెగా డీఎస్సీ నిర్వహణకు ఖాళీల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడంతో జిల్లాల అధికారులు ఆ మేరకు దృష్టిసారించారు. విభాగాల వారీగా ఖాళీల వివరాలు సేకరిస్తున్నారు. గత ఆరేళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టలేదు. మెగా డీఎస్సీ నిర్వహిస్తే ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 1,968 పోస్టులు భర్తీ అయ్యే అవకాశముంది. గత ప్రభుత్వం 5,089 పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. దాంతో నిరుద్యోగులు నిరసనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పడంతో నిరుద్యోగ అభ్యర్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదువుతున్నారు.

నిరుద్యోగుల హర్షం

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం అభ్యర్థులు కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం నాలుగు నెలల కిందట టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నిర్వహించింది. కొత్తగా బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన వారికి సైతం అవకాశం కల్పించేలా మరోసారి టెట్ నిర్వహించాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచించడంపై నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమౌతోంది. అన్ని రకాల ఖాళీలను గుర్తించి, భారీగా పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

పెరగనున్న ఖాళీలు

ప్రతీ గ్రామ పంచాయతీలోనూ బడి ఉండాలని సీఎం చెప్పడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో మూతపడ్డ పాఠశాలలను తెరవడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని ఖాళీలు, రిటైర్ కానున్న పోస్టులు కలుపుకుంటే అధిక సంఖ్యలో ఖాళీలు పెరగనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15,423 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 13,485 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 1,968 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మార్చి చివరి నాటికి చాలా మంది ఉద్యోగ విరమణ చేయనుండటంతో ఈ ఖాళీలు మరిన్ని పెరుగనున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ కానుండగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మాత్రం పదోన్నతుల ద్వారా 70 శాతం, డీఎస్సీ ద్వారా 30 శాతం భర్తీ కానున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 3 : జిల్లాలోని అన్ని కేజీబీవీలలో మెనూ పాటించకుంటే చర్యలు తప్పవని డీఈవో ఎ.రవీందర్ హెచ్చరించారు. 'కేజీబీవీలో పర్యవేక్షణ కరువు' అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి సంబంధిత కేజీబీవీ ప్రత్యేక అధికారులను హెచ్చరించినట్లు డీఈవో తెలిపారు. డీఈవో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కొందరు సీఆర్పీలు విద్యార్థులను చీటికి మాటికి కొట్టడం, విసుక్కోవడం, వంటివి చేస్తే సస్పెండ్‌చేసి ఇంటికి పంపిస్తామని, పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారికి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. విద్యార్థులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పన్నారు. విద్యార్థులకు ఇచ్చే భోజనం తప్పని సరిగా మెనూ పాటించాలని హెచ్చరించారు. ప్రతీరోజు కేజీబీవీలను పర్యవేక్షిస్తానని డీఈవో తెలిపారు.

జోగుళాంబ డీఐజీగా జోయెల్ డెవిస్



మహబూబ్‌నగర్, జనవరి 3 : జోగుళాంబజోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీఐజీగా జోయెల్ డెవిస్ నియమితుల య్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఎస్ చౌహాన్‌కు రామ గుండం కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వగా, హైదరాబాద్ ఎస్‌బీ డీసీపీగా పనిచేస్తున్న 2010 బ్యాచ్‌కు చెందిన జోయెల్ డెవిస్‌ను జోగులాంబజోన్‌కు బదిలీ చేశారు. ఎల్ఎస్ చౌహాన్ 2023 జనవరిలో బాధ్యతలు చేపట్టారు. సరిగ్గా ఏడాదికాలంపాటు ఆయన ఇక్కడ పనిచేశారు. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి జిల్లా కొట్టికోడు గ్రామానికి చెందిన జోయెల్ డేవిస్‌ది వ్యవసాయ కుటుంబం. డిగ్రీ వరకు ఊళ్లోనే చదివిన ఆయన ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు వ్యవసాయ పనులు చూసుకునే వారు. ప్రధానోపాధ్యాయుడైన తన బావ ప్రోత్సాహంతో ఐపీఎస్‌కు ప్రిపేర్ అయ్యారు. అక్కాబావ వద్ద ఉంటూ చెన్నైలోని అకాడమిక్ ప్రభా ఇనిస్టిట్యూట్‌లో రెండేళ్లపాటు శిక్షణ తీసుకున్నారు. ఐపీఎస్ సాధించడమే లక్ష్యంగా కష్టపడి చదివిని ఆయన 2010లో ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి
- నియోజకవర్గంలోని కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం



జడ్చర్ల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల/ నవాబ్‌పేట/ మిడ్జిల్/ బాలానగర్, జనవరి 3 : ఏకాగ్రతతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్లలోని కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలతో పాటు బాలికల జూనియర్ కళాశాలలో స్వంత నిధులతో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమా న్ని బుధవారం ప్రారంభించారు. నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ శంకర్, పార్టీ నాయకులతో కలిసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని మాజీ జడ్పీటీసీ రబ్బాని, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. బాలాగనర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ డబ్బులు సంపాదించుకోవడానికి రాజకీయాలలోకి రాలేదని, నిరుపేదలకు సేవ చేయాలనే సంకల్పంతోనే వచ్చానన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ఐదు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని సుమారు 1300 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో సెల్ఫీ తీసుకున్నారు. నా గురువు, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచన మేరకు తన సొంత నిధులతో జడ్చర్ల నియోజకవర్గంలో ప్రతీ ప్రభుత్వ కళాశాలలో పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు తెలిపారు. జడ్చరలలో కళాశాల అధ్యాపకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నవాబ్‌పేటలో డీసీసీ ఉపాధ్యక్షుడు పీ.రంగారావు, మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, మండల ఉపాధ్యక్షుడు హమీద్ మహేక్, అజహర్, దేపల్లి వెంకటేష్ గౌడ్, కారుకొండ భూపాల్‌రెడ్డి, కామారం నవాజ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నీల్యానాయక్, మైనుద్దీన్, రంగారెడ్డి, మునీర్‌జమ్ము, జమ్ము, పుట్టి అంజయ్య, అమ్మాపూర్ నర్సింహులు, కన్నెమోని మల్లేష్, రాధాకృష్ణ, నర్సింహులు, వివిధ గ్రామాల నాయకులు, మిడ్జిల్ కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు, ఎంపీటీసీలు గౌస్, నర్సింములు, నాయకులు జహంగీర్, ఉస్మాన్, హరిగౌడ్, శ్రీశైలం, పర్వతాలు, బాలానగర్‌లో ప్రధానాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

సెజ్‌లోని పరిశ్రమలలో నాయకుల వసూళ్లు

జడ్చర్ల : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ ప్రాజెక్ట్‌లోని నిధులను విద్య, వైద్యానికి వెచ్చించాలని జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమల యజమానులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచించారు. జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు రాజకీయ నాయకులు పరిశ్రమలలో పైసలు వసూళ్లకు పాల్పడుతున్నారన్న సమాచారం ఉందని ఆరోపించారు. వారికి సపోర్ట్ చేయవద్దని, సీఎస్సార్పీ నిధులను విద్య, వైద్యం కోసం వెచ్చించాలని కోరారు. ఎవరైనా డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నా వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అలాగే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

● పీయూలో మొదటి సంవత్సర విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రాం



పాలమూరు యూనివర్శిటీ, జనవరి 3 : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని పీయూ వైస్‌చాన్సలర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ సూచించారు. బుధవారం పీయూలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రాం కార్యక్రమానికి అతిథిగా హాజరై ప్రసంగించారు. పీయూలో ఉన్న వసతులను వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని తెలిపారు. అంతకు ముందు సైకలాజిస్ట్ వీరేంధర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఏదో ఒక వ్యాపకంలో ఉండాలని, ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. తీవ్ర ఒత్తిడి ఉంటే కౌన్సెలింగ్ తీసుకోవాలని, తల్లిదండ్రుల ఆశల నెరవేర్చాలని సూచించారు. సీనియర్ న్యాయవాది సంధ్యారాణి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయకూడదని, మనోభావాలు దెబ్బతినేలా ప్రవరిస్తే చట్టపరమైన చర్యలు కఠినంగా ఉన్నాయని హెచ్చరించారు. పీయూకి ఎక్కువగా గ్రామీణ విద్యార్థులు వస్తున్నారని, అలా వచ్చినవారు ఇంటిపై బెంగ పెట్టుకుని ఇబ్బందులు పడుతారని, వారి పట్ల అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీయూ ప్రముఖ సైకాలజిస్ట్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్, ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ సుజాత, డాక్టర్ బషీర్ మహ్మద్, డాక్టర్ కృష్ణయ్య, పీయూ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జితో మంత్రి జూపల్లి భేటీ



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీకి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జనవరి 3 : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీతో బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో దీపదాస్‌మున్షీనీ మంత్రి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారితోపాటు మాజీ ఎంపీ మందా జగన్నాథం, భాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం

నవాబ్‌పేట, జనవరి 3 : భార్యాభర్తలు గొడవపడిన ఘటనలో భార్య అదృశ్యమైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం గురుకుంట గ్రామంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జీ ఎస్‌హెచ్‌ఓ వెంకటయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుంట గ్రామంలో అనసూయ, అర్జునయ్య భార్యాభర్తలు. ఈనెల 2వ తేదీన పొలం వద్ద కుటుంబ విషయమై వారిద్దరు గొడవపడ్డారు. భర్త మందలించడంతో ఆమె ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని, ఆందోళన చెందిన ఆమె తమ్ముడు మహేందర్ బుధవారం నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణి సీఎండీగా పాలమూరు వాసి

● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 3 : సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పాలమూరు గిరిజన బిడ్డ ఎన్. బలరాం నాయక్‌ను నియమించినందుకు గిరిజనులకు సరైన న్యాయం జరిగిందని పలువురు గిరిజన విద్యార్థులు అభిప్రాయపడ్డారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీ ప్రధాన గేటువద్ద పీయూ గిరిజన విద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి నాయకులు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని తిర్మలగిరి వాసికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో ముఖ్యమైన పదవి కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన పీహెచ్‌డీ స్కాలర్స్, బంజార విద్యార్థి నాయకులు రవి, లక్ష్మీ, శ్రీనివాస్, నికిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మహత్య ఘటనపై ఆరుగురి సస్పెన్షన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 3 : జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో చదువుతున్న రామ్‌రెడ్డి అనే విద్యార్థి సోమవారం ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ సహా ఐదుగురిని రాష్ట్ర మైనార్టీగురుకుల సొసైటీ కార్యదర్శి సస్పెండ్ చేస్తూ బధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్ ఫాతిమా, అధ్యాపకులు కిషోర్ కుమార్, సాలేహబేగం, అబ్దుల్ ఖాదర్, క్రాంతికుమార్, రైమాన్‌లను సస్పెండ్ చేసినట్లు జిల్లా మైనార్టీ శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులను తాత్కాలిక సెలవులపై ఇంటికి పంపారు.

అధ్యాపకుల సస్పెన్షన్ సరికాదు : టీఎస్ యూటీఎఫ్

గురుకుల ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని, తక్షణమే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బుధవారం జిల్లా కలెక్టర్ రవినాయక్‌కు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేష్, రవికుమార్‌లు వినతిపత్రం అందజేశారు. ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న రామ్‌రెడ్డి అనే విద్యార్థి కుటుంబ సమస్యలు, తల్లి అనారోగ్యంపై బెంగతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటే ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం సరికాదన్నారు. గురుకులాల్లో కేర్‌టేకర్స్, వాచ్‌మన్‌లను నియమించాలని వారు కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా గురుకులాల కన్వీనర్ సృజన, కో-కన్వీనర్ జావేద్ పాల్గొన్నారు.

మహిళపై యువకుల లైంగిక వేధింపులు

● వాట్సాప్‌లో అశ్లీల వీడియోలు, మెసేజ్‌లు

● కేసు కాకుండా ఓ నాయకుడి ఒత్తిడి

గద్వాల క్రైం, జనవరి 3 : ఓ మహిళను ఇద్దరు యువకులు లైంగిక వేధింపులకు గురిచేయడమే కాకుండా ఆమెకు వాట్సాప్‌లో అశ్లీల వీడియోలు, మెసేజులు పంపించి ఇబ్బందులకు గురి చేశారు. ఈ విషయంపై ఆమె పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో, నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. బాధిత మహిళ, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మహిళ భర్త కాంట్రాక్ట్ ఉద్యోగి. గత ఏడాది నవంబరు 23న ఆ కాంట్రాక్ట్ ఉద్యోగి స్నేహితుడు అనీల్‌కుమార్ అత్తగారి ఊరికి వెళ్లి వస్తానని చెప్పి అతడి బైక్‌ను తీసుకెళ్లాడు. దారిలో కుక్క అడ్డురావడంతో ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పది రోజుల తర్వాత చనిపోయాడు. ఈ నేపథ్యంలో అనిల్ కుమార్ మిత్రులు కాంట్రాక్ట్ ఉద్యోగిపై దాడి చేశారు. అయినా వారు ఎవరిపైనా కేసు పెట్టలేదు. కొద్ది రోజుల తర్వాత తన భర్త బైక్‌ను తిరిగి ఇవ్వాలని ఆ మహిళ అనిల్‌కుమార్ ఫ్రెండ్ నవీన్‌కుమార్ అడగడంతో దుర్భాషలాడాడు. ఆ తర్వాత కొద్ది రోజుల నుంచి ఆమె వాట్సాప్‌కు అశ్లీల వీడియోలు, అసభ్యకర మెసేజులు పంపిస్తూ వేధించడం మొదలు పెట్టాడు. అతడితో పాటు వేణు అనే యువకుడు కూడా ఆమెను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు వారం క్రితం పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారు స్పందించలేదు. వేధింపులు మరింత ఎక్కువ కావడంతో బుధవారం ఆమె ఎస్పీ రితిరాజ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నవీన్‌కుమార్, వేణులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. అయితే వేధింపులపై కేసు నమోదు కాకుండా అదే కాలనీకి చెందిన ఓ రాజకీయ నాయకుడు పోలీసులపై ఒత్తిడి తెచ్చాడని బాధితురాలి ఆరోపించారు.

'టెట్ నిబంధన రద్దు చెయ్యాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 3 : ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి టెట్ నిబంధనలను రద్దు చేయాలని తెలంగాణ పీఆర్‌టీయూ వ్యవస్థాపకులు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా టీచర్ల సమస్యలను వివరించారు. జోన్-2 ఉపాధ్యాయుల పదోన్నతులు నిలిచిపోవడం వలన 856 మంది ఉపాధ్యాయులు నష్టపోతున్నారని, మార్చి నెలలో చాలామంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని పదోన్నతులు చేపట్టాలని, టెట్ ఉత్తీర్ణత సంబంధం లేకుండా పదోన్నతి కల్పించాలని కోరారు. టెట్ నియమావళిలోనే 44 ఏళ్ల వయస్సు దాటితే టెట్ పరీక్ష రాసేందుకు అర్హత లేదన్న విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి బోధన పద్ధతులను రద్దు చేస్తూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సీఎంను కోరారు.

వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

గద్వాల టౌన్, జనవరి 3 : పట్టణంలోని భీంనగర్‌లో వెలసిన సంతాన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామివారికి అర్చన, అలంకార సేవ చేశారు. సాయంత్రం ఆలయం వద్ద రథోత్సవాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్, కృష్ణవేణి చౌరస్తాల మీదుగా రథం ఊరేగింపు కొనసాగి, ఆలయానికి చేరుకున్నది. అనంతరం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు డాక్టర్ సుహాసిని, విక్రమసింహారెడ్డి దంపతులు, వెంకటాపురం సంయుక్తమ్మ, రాజవంశీయులు గద్వాల వెంకటాద్రి రెడ్డి, ఉషారాణి దంపతులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



రథం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

రైతుల నిరసన

» ఉమామహేశ్వర ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధితుల ఆందోళన

బల్మూరు, జనవరి 3: తమ పొలాలు ప్రాజెక్టులో నష్టపోతున్నామని రైతులు నిరసన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో బుధవారం బల్మూరు, అనంతవరం, అంబగిరి, మైలారం, కొండనాగుల గ్రామాలకు చెందిన రైతులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతు సమన్వయ కర్త సీతారాంరెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని మైలారం గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న ఉమామహేశ్వర ప్రాజెక్టు ద్వారా 2వేల 500ఎకరాల నుంచి 3వేల ఎకరాల వరకు భూములు ముంపునకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు వద్దు కాల్వలే కావాలని వారు ఈ సందర్భంగా అన్నారు. రైతులకు లాభం చేకూర్చడం ఒక వంతైతే ఎక్కువ మొత్తంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భూములు కోల్పోతున్నారని వారు వాపోయారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రస్తుత ఎమ్మెల్యే వంశీకృష్ణ చొరవ తీసుకుని రైతులకు అన్యాయం జరగకుండా కేవలం కాల్వ ద్వారానే సాగునీరందిస్తే బాగుంటుందని వారు కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారుల పనితీరును బట్టి ముందు జరగబోయే పరిణామాలకు రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్మూరు సర్పంచ్ శివశంకర్, మైలారం సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖదీర్, అనంతవరం సర్పంచ్ సహదేవుడు, అనంతవరం, అంబగిరి, మైలారం, బల్మూరు, కొండనాగుల గ్రామాల నరసింహ, మల్లేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సమన్వయ కర్త సీతారాంరెడ్డి

పిల్లిగుండ్లకు తాగునీరు అందించాలి



ధర్నా చేస్తున్న పిల్లిగుండ్ల కాలనీ వాసులు

» కౌన్సిలర్ దౌలు డిమాండ్

» గద్వాల మునిసిపల్ కార్యాలయం ముందు కాలనీ వాసుల ధర్నా

గద్వాల టౌన్, జనవరి 3 : పిల్లిగుండ్ల కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలని కౌన్సిలర్ టి. దౌలు డిమాండ్ చేశారు. కాలనీకి సంబంధించిన మిషన్ భగీరథ పైప్‌లైన్ లింక్‌ను తొలగించడంతో పది రోజులుగా కాలనీ వాసులకు తాగునీరు అందడం లేదని తెలిపారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని ఆరోపించారు. కాలనీవాసులతో కలిసి పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా దౌలు, కాలనీ వాసులు మాట్లాడారు. 15 రోజుల క్రితం వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా అయ్యిందని తెలిపారు. విషయంపై ఆరా తీస్తే మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు మాత్రమే తాగు నీరందించాల్సి ఉంటుందని, పిల్లిగుండ్ల కాలనీ పట్టణ పరిధిలో ఉన్నందున నిబంధనలు వర్తించవని అధికారులు చెప్తున్నారని తెలిపారు. నిన్న మొన్నటి వరకు లేని నిబంధనలు ఇప్పుడు ఎందుకు వచ్చాయంటూ అధికారులను నిలదీశారు. తక్షణం తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, లేకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు మధు, సుదర్శన్‌గౌడ్, సాయిబాబు, అంజి, నీలి శ్రీనివాసులు, పవన్‌గౌడ్, అంజనేయులు, ఖాజా, మెహబూబ్, దర్సెల్లి, ఎం.నరసింహ, కృష్ణ, అనిల్, జయమ్మ, సుజాత పాల్గొన్నారు. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్ కేనర్సింహను 'ఆంధ్యజ్యోతి' వివరణ కోరింది. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న మోటార్లలో ఒకటి పని చేయకపోవడం వల్ల సమస్య తలెత్తిందని ఆయన తెలిపారు. ఇప్పటికే మోటారు మరమ్మతు పూర్తి చేశారని, గురువారం ఉదయం తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు.

రైల్వే స్టేషన్లను తనిఖీ చేసిన జీఎం



మరికల్ స్టేషన్ వద్ద పర్యటిస్తున్న జీఎం అరుణ్‌కుమార్

మహబూబ్‌నగర్, జనవరి 3 : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని పలు రైల్వే స్టేషన్లలను తనిఖీ చేశారు. కాచిగూడ-మహబూబ్‌నగర్-క్రిష్ణా సెక్షన్‌లో బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తనిఖీ చేశారు. రియల్‌విండో తనిఖీ ద్వారా ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రత అంశాలను పరిశీలించారు. మరికల్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన స్టేషన్ ఆవరణను పరిశీలించారు. అనంతరం స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆ తరువాత జక్లేర్ రేల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఆయన గమనించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయం, స్టోర్ రూమ్, రిలేరూమ్‌లతో సహా మొత్తం స్టేషన్ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఆ తరువాత మాగనూర్ స్టేషన్ వెళ్లిన ఆయన స్టేషన్ ఆవరణతోపాటు స్టేషన్ మాస్టర్ కార్యాలయంలోని రికార్డ్‌లను తనిఖీ చేశారు. అక్కడి నుంచి దేవరకద్ర రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఆయన అక్కడి వసతులను పరిశీలించారు. స్టేషన్‌లో సౌకర్యాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు స్థానిక ప్రజాప్రతినిధులు జీఎంను కలిసి సమస్యలను విన్నవించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దండ, జనవరి 3 : ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ అహ్మద్ (35) అనే వ్యక్తి గత డిసెంబరు 31న ద్విచక్రవాహనంపై జూపల్లి గ్రామానికి వెళ్లి తిరిగివస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అహ్మద్‌ను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అహ్మద్ మంగళవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య యాస్మిన్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

కోస్గి రూరల్, జనవరి 3 : పోలీస్ స్టేషన్ ప్రహరీ పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దొంగతనం జరగగా ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. డిసెంబరు 30 శనివారం పాఠశాల ముగిశాక తాళాలు వేసి వెళ్లారు. ఆదివారం, సోమవారం వరుస సెలవులు కావడంతో మంగళవారం యధావిధిగా పాఠశాలకు వచ్చి చూడగా టీవీ, సీపీయూ, ప్రింటర్ లేకపోవడం, వేసిన తాళాలు వేసినట్లే ఉండటంతో ఉపాధ్యాయులంతా కంగారు పడ్డారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ప్రధానోపాధ్యాయుడు ఫిర్యాదు చేయడంతో బుధవారం పాఠశాలలో పోలీసులు తనిఖీ చేశారు. పాఠశాల తాళం ఇద్దరు స్వీపర్లు, ప్రధానోపాధ్యాయుడి దగ్గరే ఉంటుంది. వేసిన తాళం వేసినట్లే ఉండగా సామగ్రి ఎలా పోతుందని దర్యాప్తు మొదలుపెట్టారు. ఇంటి దొంగలే అయి ఉండవచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి

కోస్గి రూరల్, జనవరి 3 : వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దామరగిద్ద మండలం నర్సాపూర్‌కు చెందిన మోహన్ (40), గుండుమల్ మండలం హన్మన్‌పల్లికి చెందిన అంజమ్మతో వివాహం అయ్యింది. కాగా భార్యాభర్తల మధ్య గొడవలు ఉండటంతో రెండేళ్లుగా భార్య కాపురానికి రావడం లేదు. ఈ క్రమంలో మనస్తాపం చెంది వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. కాగా ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఎంపీపీ అవిశ్వాసానికి హైకోర్టు బ్రేక్

మిడ్జిల్, జనవరి 3 : కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ ఎంపీపీ బరిగెల సుదర్శన్‌పై అవిశ్వాసం కోరుతూ గతనెల డిసెంబరు 12న జిల్లా అధికారులకు అవిశ్వాస తీర్మానం అందజేశారు. జనవరి నాల్గున వ తేదీన అవిశ్వాసం పెట్టనున్నట్లు అధికారులు నోటీసులు జారీ చేశారు. తన పదవి నాలుగు సంవత్సరాలు పూర్తికాలేదని ఎంపీపీ సుదర్శన్ హైకోర్టును ఆశ్రయించడంతో, విచారణ చేపట్టి ఎంపీపీ అవిశ్వాసంపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మరో ఆరు నెలల పాటు ఎంపీపీగా సుదర్శన్ పదవిలో కొనసాగనున్నారు.





ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



రాచాలపల్లిలో సీతారామాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

ఊర్కొండ, డిసెంబరు 3: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మండలంలోని రాచాలపల్లి గ్రామంలో సీతారామాంజనేయ ఆలయంతో పాటు, శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. స్థానిక సర్పంచ్ విజయమ్మ, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాధారం సర్పంచ్ ధ్యాప నిఖిల్ రెడ్డి, జకినాలపల్లి సర్పంచ్ తలసాని అనిల్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్య, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మధురెడ్డి, ఆదినారాయణ, మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు



అక్షింతల కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

తిమ్మాజిపేట, జనవరి 3 : అయోధ్య శ్రీరాముని అక్షింతలకు తిమ్మాజిపేట మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించిన అక్షింతలతో కూడిన కలశాలను ఎత్తుకుని శ్రీరామ జయరామ జయ జయ రామ అంటూ సంకీర్తనలు చేస్తూ శోభాయాత్రగా ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. గ్రామాలకు చేరుకున్న అక్షింతలను భక్తులు భాగస్వాములై ప్రతీ ఇంటికి అందజేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు దాచేపల్లి వేణుగోపాల్, కోటీశ్వరాచారి, గురుప్రసాద్, నాగరాజు, బద్రీ, రవీందర్, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

● లింగాల: మండల పరిధిలోని అప్పాయిపల్లిలో బుధవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో అయోధ్యరాముడి అక్షింతలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అంతకు ముందు అంజనేయస్వామి ఆలయంలో అక్షింతలకు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి తిరిగి అక్షింతలు పంపిణీ చేస్తున్న సమయంలో మహిళలు మంగళహారతులిచ్చి అందుకున్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సలేశ్వరం, ఎంపీటీసీ సభ్యులు కాశీనాథం, పర్వతాలు, కృష్ణ పాల్గొన్నారు.

'దళిత జర్నలిస్టులకే మీడియా అకాడమీ చైర్మన్ పదవి ఇవ్వాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 3: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ పదవికి దళిత జర్నలిస్టులకు అవకాశం ఇవ్వాలని దళిత జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాన్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో దళిత జర్నలిస్టుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాన్ మాట్లాడుతూ ప్రతి జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో దళిత జర్నలిస్టుల ఫోరం యూనియన్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం పథకం ద్వారా దళిత జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. దళిత జర్నలిస్టుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, మాజీ అధ్యక్షుడు పంగిడిచెరువు వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి పెద్దిస్వామి తదతరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు క్రీడల్లో రాణించాలి

- డీఆర్‌డీవో నర్సింగరావు



ఆటల పోటీల్లో ట్రై సైకిల్ పరుగులో పాల్గొన్న దివ్యాంగులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 3: దివ్యాంగులు చదువు, ఉద్యోగాలతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి నర్సింగరావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి నర్సింగరావు హాజరై పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి డివిజన్‌ల నుంచి దివ్యాంగ క్రీడాకారులు వారికి నైపుణ్యం కలిగిన క్రీడల్లో పాల్గొని ప్రతిభను చాటారు. పోటీల్లో సీనియర్, జూనియర్, పురుషులు, మహిళల విభాగంలో పరుగు, జావెలిన్‌త్రో, షార్ట్‌పుట్, వీల్ చైర్ రన్నింగ్, చదరంగం, క్యారంబోర్డు తదితర క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి వెంకటలక్ష్మి, జిల్లా దివ్యాంగుల మానిటరింగ్ కమిటీ సభ్యుడు కందనూలు నిరంజన్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు భీంసాగర్, నారాయణమ్మ, నిర్మల, లక్ష్మి, శిరీష, బాలపీరు, జిల్లా దివ్యాంగుల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి డిపో మేనేజర్‌గా సుభాషిణి



బాధ్యతలు స్వీకరిస్తున్న వి.సుభాషిణి

కల్వకుర్తి, జనవరి 3 : కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వి.సుభాషిణి పదవీ బాధ్యతలు స్వీకరించారు. కల్వకుర్తిలో మేనేజర్‌గా పని చేసిన శ్రీకాంత్ హుజూరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో హిమాయత్‌నగర్-2 డిపో నుం చి పదోన్నతిపై సుభాషిణి కల్వకుర్తికి బదిలీ అయ్యారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డిపో మేనేజర్‌ను ఆర్టీసీ నాయకులు ధార సుందర్, ఆర్టీసీ నాయకులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న శ్రీకాంత్‌కు ఆర్టీసీ నాయకులు, అధికారులు వీడ్కోలు పలికారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు



సూచనలిస్తున్న సీఐ ఆంజనేయులు

కల్వకుర్తి, జనవరి 3: రోడ్లపై వాహనాలు ఇష్టానుసారంగా నిలిపి ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ రమేష్‌లు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఉన్న ఎస్‌బీఐ, హోటల్, షాపుల యాజమానులకు హెచ్చరించారు. నో పార్కింగ్ బోర్డులు పెట్టాలని సూచించారు. నిబంధనల ను అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఎస్‌బీఐ, హోటల్లో, షాపుల యాజమానులకు నోటీసులు జారీ చేయాలని వారు సూచించారు. ఎస్‌ఐ రాజు, కానిస్టేబుల్స్ చిరంజీవి, బాలునాయక్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి జీవితం అందరికీ ఆదర్శం

- జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు

తిమ్మాజిపేట, జనవరి 3 : సంఘ సంస్కర్త ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శమని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆశయాలను సాధించడం కోసం ప్రతీ ఒక్కరు పునరంకితం కావాలన్నారు. ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, ఎంపీటీసీ లీలావతి, ఎంపీడీవో కరుణశ్రీ, నోడల్ అధికారి సత్యనారాయణశెట్టి, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి రెడ్డి, నరసింహారెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి: ఆడ పిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్యమూర్తి రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయిపూలే అని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, కొల్లాపూర్ నియోజకవర్గ బీసీ సంఘం ఇన్‌చార్జి కురుమూర్తిలు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లి అంబేడ్కర్ బస్టాండ్ చౌరస్తాలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో సావిత్రిబాయి పూలే చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పలువురు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాముడు, నాయకులు రవీందర్, ఆంజనేయులు, తిరుపతయ్య, కావలి సింగోటి, జిల్లా దళిత సంఘం నాయకులు పుట్టపాగ మునీందర్, పుట్టపాగ శ్యాము, కుమార్, ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ నరేష్, గిరిజన సంఘం నాయకులు రూపసింగ్, శ్రీకాంత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: స్త్రీల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయమని మండల విద్యాధికారి చంద్రుడు అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రంలో ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యారంగంలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. సావిత్రిబాయి పూలే అణగారిన వర్గాల అభివృద్ధి కోసం, స్త్రీల విద్యాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిందన్నారు. ఇదే క్రమంలో మండల కేంద్రంలోని సిద్దార్థ మోడల్ స్కూల్, సీఎల్ఆర్ కళాశాల, బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి చంద్రుడు, తొలిమెట్టు నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, సిద్దార్థ మోడల్ స్కూల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, ఎం.శివప్రసాద్, రామస్వామి, సీఎల్ఆర్ కళాశాల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు శివశంకర్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు, చైతన్య కళాశాల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్, ఎస్ఎస్‌యూఐ నాయకులు లడ్డుయాదవ్, వినోద్, ఈశ్వర్‌లాల్, శేఖర్ పాల్గొన్నారు.

● అచ్చంపేట అర్బన్: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం మండల పరిధిలోని నడింపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల, కేజీబీవీతో పాటు పల్కపల్లి, గుప్పన్‌పల్లి, ఐనోల్, బొమ్మన్‌పల్లి, సిద్దాపూర్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అర్జునయ్య శ్రీనివాసులు, బషీర్ హమ్మద్, కుసుమ పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలతో సాయిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా గువ్వలోనిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు సాయిత్రిబాయి పూలే వేషధారణలో అలరించారు. ఉపాధ్యయులు చైతన్య, శ్రీలత తదితరులు ఉన్నారు.

● ఊర్కొండ: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆశయ సాధనలో భాగస్వాములం అవుదామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ఊర్కొండపేటలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. అంబేడ్కర్ యువజన సభ్యులు ఎడ్ల మల్లేష్, ఆంజనేయులు, శ్రీశైలం, వెంకటేష్, నాగరాజ్ కాంగ్రెస్ నాయకులు చంద్రయ్య, షైబాజొద్దీన్, కైసర్, మాసూమ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం వివిధ ప్రజా సంఘాలు, కళాశాలలు, పాఠశాలల్లో జరుపుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎ.సుందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, పూలే జయంతి ఉత్సవ కమిటీ సభ్యురాలు రాజేశ్వరి, రేష్మాబేగం, హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు సదానందంగౌడ్, కౌన్సిలర్ ఎజాస్, గోరటి శ్రీనివాసులు, కుర్మిద్ద సర్పంచ్ దామోదర్‌గౌడ్, బీసీ సబ్ ప్లాన్ అధ్యక్షుడు రాజేందర్, ఎమ్మార్పీఎస్ డివిజన్ నేత టి.కృష్ణ, నాయకులు గోపాల్, లక్ష్మయ్య ఉన్నారు.

● బిజినేపల్లి: మండలంలోని గంగారం, పాలెం, బిజినేపల్లి తదితర గ్రామాల్లో పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని నేటి విద్యార్థినులు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు నాయక్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి, రాఘవేందర్, రాజారాంప్రకాష్, రాజప్ప, మహమ్మద్, కురుమయ్య, రమాదేవి, ఇందుమతి, ఊర్మిళ, పూర్ణ, చంద్రకళ, రాధ, సునీత, పావని తదితరులు ఉన్నారు.

● లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబట్‌పల్లిలో జయతి వేడుకలను జరుపుకున్నారు. హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయులు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్ : సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం పట్టణంలోని గాంధీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి సావిత్రిబాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మాలల చైతన్య సమితి ఆధ్వర్యంలో

కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ముందు మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాందాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే చిత్ర పటాలకు పూల మాలలు వేసి మద్దెల రాందాస్, మాలల చైతన్య సమితి నాయకులు, జర్నలిస్టులు నివాళులర్పించారు. మాలల చైతన్య సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి అవుట ఎర్రశ్రీను, బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడగంటి నరసింహ, తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యులు అవుట రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్‌యాదవ్, మాలల చైతన్య సమితి నాయకులు వెంకటేశ్, సందీప్, శేఖర్, మద్దెల వెంకటరమణ, మదగం భగవంతు, కృష్ణప్రసాద్‌యాదవ్, మద్దెలకుర్మయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.

● పదర: మహిళలకు ఆది గురువు సావిత్రిబాయి పూలే అని వంకేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం అంజనమ్మ అన్నారు. బుధవారం పూలే జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. వసంత, వెంకటేశ్వర్‌రావు, గుణాకర్, పరుశరామ్, నిరంజన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్: అమ్రాబాద్ జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాయుడు బాలకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో...



జిల్లా కేంద్రంలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

● నాగర్‌కర్నూల్ టౌన్: భారతీయ సంఘం సంస్కర్త, ప్రథమ ఉపాధ్యాయని, రచయిత్రి సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే సతీమణి, మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సమాజానికి పరిచయం అయ్యిందని పేర్కొన్నారు. కానీ సాయిత్రి బాయి పూలే సమాజంలో పాతుకుపోయిన కుల వివక్ష, సతీసహగమనం, బాల్య వివాహాలు, మూఢనమ్మ కాల వంటి దురాచారాలపై పోరాటం చేసి రూపుమా పిన గొప్ప మహిళా శిరోమణి అని కొనియాడారు. సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు వార్డెన్ చెన్నయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి వెంకటశెట్టి, నాయకులు పాండురంగయ్య, శ్రీనివాసులు, సాయిరెడ్డి, బొడ్డుపాండు, జగన్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, విష్ణుమూర్తి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఐద్వా ఆధ్వర్యంలో పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి జిల్లా అధ్యక్షురాలు కందికొండ గీత పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఐద్వా సంఘం మహిళలు జయలక్ష్మి, కృష్ణవేణి, పాల్గొన్నారు.

● కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న పూల మాల వేసి నివాళులు అర్పించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత శివకుమార్, నాయకులు కృష్ణ, శివుడు పాల్గొన్నారు.



అచ్చంపేట ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



కల్వకుర్తిలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, జేజేసీ ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి

టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

వంగూరు, జనవరి 3: టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండరును బుధవారం వంగూరులో జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి తహసీల్దార్ కిరణ్మయితో కలిసి ఆవిష్కరించారు. ఎంఈవో శంకర్‌నాయక్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పండిత్‌రావు, టీఎస్ యూటీఎఫ్ నాయకులు చిన్నయ్య, లింగమయ్య, జంగయ్య, పరుశరాములు, నాయకులు బొజ్జ కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం సంఘం నాయకులు మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆవిష్కరించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, రాష్ట్రకమిటీ సభ్యుడు చెన్నయ్య, మండల అధ్యక్షుడు నాగభూషణం, కార్యదర్శి రవి, నాయకులు యాదగిరి తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

తాడూరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో బుధవారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ఎంఈవో భాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యల పరిష్కారంతోపాటు ఉపాధ్యాయుల సమస్యలను సైతం ప్రభుత్వం ముందు చూపుతో పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. పీఆర్‌టీయూ పత్రికా సంపాదక సభ్యులు సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు ఆగిర్ వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి కే సుధాకర్, రాష్ట్ర బాధ్యులు నరహరిరెడ్డి, పాలమూరు శ్రీనివాసులు, జిల్లా బాధ్యులు ప్రమోద్‌కుమార్, గణేష్‌కుమార్, రాఘవేందర్, ప్రేమ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చారకొండ, జనవరి 3: వాహనదారులు రోడ్డు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ రవి అన్నారు బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనదారులకు ఎస్ఐ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 60 బైక్‌లకు పైగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత పత్రాలు, నెంబర్‌ప్లేట్లు లేని వాటిపై చలాన్లు వేశారు. తనిఖీ ల్లో భాగంగా హెడ్ కానిస్టేబుళ్లు వెంకట్‌రెడ్డి, నాగయ్య, సిబ్బంది హరిలాల్, జానినాయక్, భాస్కరచారి, అరుణచలం, రేణయ్య పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

బిజినేపల్లి, జనవరి 3 : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అనంతరం విద్యార్థుల హాజరు, ప్రగతి, బడి బయటి పిల్లల సర్వేపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ మల్లేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి'

అమ్రాబాద్, జనవరి 3: నల్లమల ప్రాంతంలో కొండపై వెలసిన రాయలగండి శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఉత్సవాలను ఈ మారు పది రోజులపాటు అత్యంత ప్రతిష్ఠాత్మంగా నిర్వహించాలని పలువురు భక్తులు సూచించారు. బుధవారం అమ్రాబాద్ మండల కేంద్రంలోనిర్వహించిన ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశం సందర్భంగా అమ్రాబాద్ ఉమ్మడి మండలానికి చెందిన పలువురు ఉత్సవ కమిటీ నాయకులు, భక్తులు మాట్లాడారు. ఈసారి వైభవంగా ఉత్సవాలను నిర్వహించడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని, ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యుడు కల్లల నాసరయ్య విలేకరులకు తెలిపారు. ఈ నెల 7వ తేదీన రాయలగండీ శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు ఆయన వివరించారు. ఉమ్మడి మండలంతో పాటు అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉన్న భక్తులను కూడా కలుపుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాలను జరుపుకునే విధంగా కృషి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌కు సన్మానం



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న డీఎల్ పాండు

పెద్దకొత్తపల్లి, జనవరి 3 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎ.సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ కార్మిక ఉపాధి కల్పన శాఖ న్యాయవాది డీఎల్ పాండు శాలువాతో ఘనంగా సన్మానించినట్లు ఆయన తెలిపారు. బుధవారం హైదరాబాద్ హైకోర్టులోని జనరల్ చాంబర్‌లో ఆయన ఎ.సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చివరి మాజీ ముఖ్య మంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో చివరి అడ్వకేట్ జనరల్‌గా సుదర్శన్‌రెడ్డి పని చేసిన సమయంలో ప్రభుత్వ న్యాయవాది డీఎల్ పాండు మత్స్యశాఖ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిలర్‌గా పని చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ ప్రభుత్వ న్యాయవాదిగా డీఎల్.పాండు పని చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన డీఎల్ పాండు ప్రస్తుతం హైకోర్టులో ప్రభుత్వం తరఫున కార్మిక ఉపాధి కల్పన శాఖ న్యాయవాదిగా పని చేస్తున్నారు.

సంక్షేమ పథకాలు అందించేందుకే..



పదవ వార్డులో ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరిస్తున్న మునిసిపల్ కమిషనర్ సొంటె రాజయ్య, కౌన్సిలర్ షేక్ రహీంపాషా

కొల్లాపూర్, జనవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రతి వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టినట్లు లబ్ధిదారులు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ సొంటె రాజయ్య పిలుపునిచ్చారు. బుధవారం మునిసిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో మునిసిపల్ కౌన్సిలర్ షేక్.రహీంపాషా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి మునిసిపల్ కమిషనర్ హాజరయ్యారు.

సద్వినియోగం చేసుకోవాలి

● పెద్దకొత్తపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తం, అర్హులైన ప్రతీ ఒక్కరు మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే చిన్నకొత్తపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. స్కూల్ భవనంపై నుంచి కేవీ కరెంటు వైరు ఉండటంతో ఉపాధ్యాయులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి వైర్లు తొలగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. జడ్పీటీసీ మేకల గౌరమ్మ, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్ బచ్చన్నగౌడ్, మాజీ జడ్పీటీసీ మురళీధర్, నాయకులు కొండలయ్యగౌడ్, చంద్రయ్య ఉన్నారు.

● అచ్చంపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీవో మధుసూదన్ గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రంగాపూర్, బ్రాహ్మణపల్లి, అక్కారం, బక్కలింగాయిపల్లి, జోంగ్యతండాలలో ప్రజాపాలన దరఖాస్తులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో స్వీకరించారు. దాదాపు 1300మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు. ఎంపీపీ శాంతబాయి, సర్పంచ్ లోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలో బుధవారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న గ్యారెంటీల పథకం కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచిం చారు. సర్పంచ్ స్వర్ణలత, విద్యుత్ ఏఈ అమర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

● కల్వకుర్తి: పట్టణంతోపాటు మండలంలోని లింగసానిపల్లి, కుర్మిద్ద, వేపూర్, యంగంపల్లి గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. లింగసానిపల్లిలో 566, కుర్మిద్దలో 450,వేపూర్‌లో 499, యంగంపల్లిలో 405దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ ఇబ్రహీంలు తెలిపారు. వైస్ ఎంపీపీ కొండూ రు గోవర్ధన్, లింగసా నిపల్లి సర్పంచ్ జంగ య్య, కుర్మిద్ద సర్పంచ్ జ్యోతి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

● వెల్దండ: సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ భూపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్‌యాదవ్, మొక్తాల శేఖర్, మార్కెట్ డైరెక్టర్ వెంకటయ్య, నాయకులు మల్లేష్, శంకర్, చంద్రయ్య, శ్రీను, దేవేందర్, శ్రీశైలం, మల్లయ్య, శివ తదితరులు ఉన్నారు.

● చారకొండ: ఆరు గ్యారెంటీల పథకాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని చారకొండ, మర్రిపల్లి, శాంతిగుడెం గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగింది. మర్రిపల్లి, శాంతిగుడెంలో సర్పంచులు నరేష్‌నాయక్, అనిశెట్టి శ్రీనివాసులు అధికారులతో కలిసి ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులు స్వీకరించారు. ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్, ఉపసర్పంచులు ధ్యాప కేశరెడ్డి, లక్ష్మి, మాజీ జడ్పీటీసీ గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, పంచాయతీ కార్యదర్శులు గణేష్, రవిశంకర్, హరిక, వినోద్, మహేష్ పాల్గొన్నారు.

● లింగాల: మండలంలో బుధవారం పద్మన్నపల్లి, ధారారం, సూరాపూర్, దత్తారం, అవుసలికుంట గ్రామాల్లో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల కోసం ప్రజల నుంచి 2258 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ ఉమా, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్: మండల పరిధిలోని బీకే ఉప్పునుంతల, బీకే లక్ష్మాపురం తండాలలో ప్రజా పాలన సభలను నిర్వహించారు. ఇప్పటివరకు మండలంలో వివిధ పథకాలకు 6 వేల 250 దరఖాస్తులు వచ్చినట్లు అమ్రాబాద్ ఎంపీడీవో రామ్మోహన్ విలేకరులకు తెలిపారు. తహసీల్దార్ శ్రీకాంత్ మండల పంచాయతీ అధికారి వెంకటయ్య అయా గ్రామాల సర్పంచుల, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.